JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 24-02-2026
Medchal - Malkajgiri | Tuesday 24-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 269
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 269 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# పత్తి రైతులకు వారం రోజుల్లో బకాయిలు విడుదల చేయాలి

- నడిగడ్డ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసింది.. కాంగ్రెస్ కూడా అన్యాయం చేస్తోంది.
- జోగులాంబ గద్వాల్ రైతు సంఘర్షణ సభలో కవిత




జయభేరి, గద్వాల జోగులాంబ:

కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టింది. ప్రజల కోసం కొత్త ఆయుధాన్ని సిద్ధం చేస్తున్న.. ఆ ఆయుధం మీ చేతిలో రాజకీయ అస్త్రమవుతది. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడుదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని జాగృతి అధినేత కవిత అన్నారు.

# 25 నుంచి ఇంటర్ పరీక్షలు



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతు న్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలను సెంటర్లుగా ఎంపిక చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్

...మిగతాది 2 లో




# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలి

- గౌరెల్లి ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- న్యాయపరమైన చిక్కుల పరిష్కారానికి ప్రక్రియ మొదలు పెట్టాం
- రైతులకు న్యాయపరమైన చెల్లింపులు
- జూన్ 2కు ముందే భూసేకరణకు నిధులు.. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్

జయభేరి, హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో నిర్మించే ప్రాజెక్టులలో గౌరెల్లి ప్రాజెక్టు ముఖ్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.
లక్షా6 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులుతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పనులు మందగించాయన్నారు. అయితే అటువంటి అవంతారాలను అధిగమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సుస్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా అక్కనపెట మండలంలోని గౌరెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పురోగతిపై సోమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇ.ఎన్.సి జెనరల్ రమేష్ బాబు లతో పాటు కరీంనగర్, హనుమకొండ,సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వరద కాలువ ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.యం.సిల నీటితో ఈ రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టి.యం.సిల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయాకట్టు సేద్యంలోకి

...మిగతాది 2 లో



# కల్తీ పాలు తాగి నలుగురు మృతి

- రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

జయభేరి, రాజమండ్రి, ఫిబ్రవరి 23 :

కల్తీ పాల ప్రభావంతో రాజమహేంద్రవరంలో ప్రజలు చనిపోతున్నారన్న ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలు, మరణాలకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరికీ ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్య

...మిగతాది 2 లో

# ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం..

- అమెరికా దాడుల భయం..
- తక్షణమే ఆదేశాన్ని వీడండి..
- భారత పౌరులకు ఎంబసీ అడ్వయిజరీ




జయభేరి, న్యూ డిల్లీ, ఫిబ్రవరి 23 :

ఏ క్షణమైనా ఇరాన్ పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. 'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది. అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు

...మిగతాది 2 లో

# టాక్సీ డ్రైవర్లకు బంపర్ ఆఫర్




- రూ. 500 పెట్టుబడి పెట్టి, ఆదాయంలో వాటా సంపాదించండి
- సహకార ఆలోచన, పద్ధతిని సరిగ్గా అర్థం చేసుకుంటే, ఎలాంటి ప్రశ్నలు తలెత్తవు
- భారత్ టాక్సీ మిమ్మల్ని ఎప్పుడూ దోపిడీ చేయదు

జయభేరి, న్యూఢిల్లీ:

కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా సోమవారం (ఫిబ్రవరి 23) భారత్ టాక్సీ డ్రైవర్లతో సంభాషించారు. భారతదేశపు మొట్టమొదటి సహకార ఆధారిత రైడ్‌హెయిలింగ్ ప్లాట్‌ఫామ్ అయిన భారత్ టాక్సీని అమిత్ షా ఫిబ్రవరి 5న ఢిల్లీలో ప్రారంభించారు. రెండు నెలల పైలట్ ప్రాజెక్టుగా ఈ ప్రయోగం విజయవంతమైంది. ఈ సేవ మొదట ఢిల్లీఎన్‌సిఆర్, గుజరాత్‌లో ప్రారంభించారు.

...మిగతాది 2 లో



# గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్ గా 'హైదరాబాద్'

- 'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తెలంగాణ యువత
- ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఇన్నోవేషన్ ఎకో సిస్టం

జయభేరి, హైదరాబాద్ :

'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరో స్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్ ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అందుకోసం... పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా

...మిగతాది 2 లో




# దుష్టుల సింహ స్వప్నం.. శ్రీలక్ష్మీ నృసింహుడు

▶▶ మొదటిపేజీ తరువాయి

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం..

తేవాలి అన్నది రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి సవరించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు పెట్టమన్నారు. అయితే అదే సమయంలో భూసేకరణ విషయంలో రైతులకు అందించే చెల్లింపులు న్యాయబద్ధంగా ఉండడంతో పాటు సకాలంలో నిధుల మంజూరుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు అవసరమైన నిధులను జూన్ 2 ముందే విడుదల చేస్తామని అందుకు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలని ఆయన కరీంనగర్, హనుమకొండ, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటున్న గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కేసు మరో రెండు రోజుల్లో విచారణకు రానున్న సందర్భంలో చిక్కులను అధిగమించెందుకు అవసరమైన వ్యూహంతో సిద్ధంగా ఉండాలని సమీక్షలో పాల్గొన్న అడ్వకేట్ జెనరల్ ను ఆయన ఆదేశించారు. అనేక ఆవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నివైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఇక పై నిధుల కేటాయింపులలో కుడా ఎటువంటి అలసత్వానికి అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇదే సమీక్షలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిరంతరం ఒత్తిడి పెంచుతున్నామని అందుకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్దేశించిన రీతిలో దేవాదుల, గౌరెల్లి తో సహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను పూర్తి చేయాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా పెరుగుతున్న నేపద్యంలో భూముల ధరలు పెరగడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపరిహారం కోరుకుంటున్నారని అందుకు సంబంధించిన విధాన నిర్ణయాలు న్యాయపరంగా తీసుకోవాలని సూచించారు. గౌరెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖా సలహాదారు ఆదిత్య దాస్ నాథ్ కు సూచించారు.

## టాక్సీ డ్రైవర్లకు బంపర్ ఆఫర్

రెండేళ్లలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించనున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా భారత్ టాక్సీ డ్రైవర్లతో బహిరంగంగా సంభాషించి వారి సమస్యలు, సూచనలను విన్నారు. కష్టపడి పనిచేసే వ్యక్తి లాభం పొందాలని అమిత్ ఆకాంక్షించారు. సహకార రంగం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, కష్టపడి పనిచేసే వారు ప్రయోజనాలను పొందుతారని ఆయన అన్నారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వానికి ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. "కేవలం రూ. 500 మాత్రమే పెట్టుబడి పెడితే చాలు. మూడేళ్ల తర్వాత భారత్ టాక్సీ రూ. 25 కోట్లు సంపాదిస్తుంది. అందులో 20% అంటే రూ. 5 కోట్లు మీ మూలధనంగా భారత్ టాక్సీ ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. టాక్సీ నడిపిన కిలోమీటర్ల సంఖ్యను బట్టి అదనంగా 80% మీ ఖాతాకు తిరిగి ఇవ్వడం జరుగుతుంది" అని మంత్రి అమిత్ షా అన్నారు. "ప్రస్తుతం, మీకు స్థిర అద్దె లభిస్తుంది. కానీ మీరు యజమాని కాబట్టి, లాభాలలో మీకు కూడా వాటా ఉండాలి. కాబట్టి, మీరు ఆ వాటాను పొందబోతున్నారు, అయితే, మొదటి మూడు సంవత్సరాలు ఓపిక పట్టాలి." అని అమిత్ షా తెలిపారు. భారతదేశంలో రైడ్‌హెయిలింగ్ సర్వీస్ మార్కెట్ ప్రస్తుతం ఉబెర్, ఓలా, రాపిడో వంటి కొన్ని సంస్థలచే ఆధిపత్యం చెలాయిస్తోంది. జూన్ 6, 2025న ప్రారంభించి మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం, 2002 కింద నమోదు చేయడం జరిగింది. భారత్ టాక్సీ డ్రైవర్ల మధ్య ప్రత్యక్ష లాభాల భాగస్వామ్యంతో జీరోకమిషన్, సర్జ్‌ఫ్రీ ధరల నమూనాపై పనిచేస్తుంది. ఇది విదేశీ పెట్టుబడితో రైడ్‌హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌లకు స్థానిక ప్రత్యామ్నాయంగా ప్లాట్‌ఫామ్‌ను ఉంటుందని అమిత్ షా తెలిపారు. "సహకార ఆలోచన, పద్ధతిని సరిగ్గా అర్థం చేసుకుంటే, ఎలాంటి ప్రశ్నలు తలెత్తవు. సహకారం అంటే కలిసి పనిచేయడం, కలిసి లాభాలు సంపాదించడం." అని అమిత్ స్పష్టం చేశారు. "భారత్ టాక్సీ లక్ష్యం ఏ ప్రైవేట్ కంపెనీ లాగా లాభాలు ఆర్జించడం మాత్రమే కాదు, ప్రజలను శక్తివంతం చేయడమే. అన్ని ఖాతాలు పారదర్శకంగా ఉంటాయి. మీకు ముందుగానే అన్ని సమాచారం అందించడం జరగుతుంది. ఈ వ్యవస్థ సహకార సూత్రాలపై పనిచేస్తుంది, ప్రైవేట్ కంపెనీ లాగా కాదు. భారత్ టాక్సీ మిమ్మల్ని ఎప్పుడూ దోపిడీ చేయదు." అని అమిత్ షా భరోసా ఇచ్చారు. "ఇంత పెద్ద సంస్థను నిర్మించడానికి దేశంలోని ఐదు అతిపెద్ద సహకార సంస్థలను విలీనం చేయడం జరిగింది. మీ సంఖ్య పెరిగే కొద్దీ, భాగస్వామి కావాలనుకునే ఏ సారథి అయినా 500 రూపాయల వాటా తీసుకొని యజమాని కావచ్చు. భారత్ టాక్సీ డైరెక్టర్ల బోర్డు ఎన్నికైనప్పుడు, కొన్ని సీట్లు సారథి సభ్యులకు రిజర్వ్ చేయడం జరిగింది. మీ ప్రయోజనాలను పూర్తిగా చూసుకుంటారు" అని హోం మంత్రి అన్నారు.

## గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్..

తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సోమవారం నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్ట్ హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజనీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఏఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్ సీఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ... ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలెప్ మెంట్ పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్' గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్, సీఐవో శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండీ అండ్ హెడ్ సూర్య తమ్మిరాజు, సీటీవో ఇమ్రాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం..

చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి' అని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో తెలిపింది. ఇరాన్‌అమెరికా దేశాల మధ్య అణు చర్చలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఇరాన్‌లో తొలిదశ అల్లర్లలోనే 7,105 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన ఒక మానవ హక్కుల సంఘం తెలిపింది.

# ఎగువ సభలోనూ.. కమలమే

దేశంలో 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ బలం ఏటేటా పెరుగుతోంది. అయితే రాజ్యసభలో ఇప్పటికీ బీజేపీకి సొంతంగా పూర్తిస్థాయి బలం లేదు. దీంతో మిత్రపక్షాల మద్దతుతో బిల్లులు పాస్ చేయించుకుంటోంది. అయితే ఈ ఏడాది చివరి నాటికి బీజేపీ పూర్తిస్థాయి బలం సాధించే అవకాశం ఉంది. ఇదే సమయంలో మార్చి 31 నాటికి రాజ్యసభ నుంచి మూడు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం కోల్పోనున్నాయి. మరో నాలుగైదేళ్లు మళ్లీ అడుగుపెట్టే అవకాశం కూడా లేదు. మార్చి 31 వరకు 37 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి, ఇందులో మహారాష్ట్ర (7), తమిళనాడు (6), బిహార్ (5), పశ్చిమబెంగాల్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-హర్యాణ (పోలు 2), హిమాచల్ ప్రదేశ్ (1) రాష్ట్రాలు కీలకం. తెలంగాణలో కాంగ్రెస్ 2, హిమాచల్‌లో 1 సీటు ఆకలింటుంది, మిగతావి ఎన్‌డీఏకు దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే వైసీపీకి రాజ్యసభలో గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. గతంలో నలుగురు ఎంపీలు పార్టీకి రాజీనామా చేయడంతో వైసీపీ బలం భారీగా తగ్గింది. ఇప్పుడు ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేయడంతో వైసీపీ రాజ్యసభ బలం నాలుగుకు పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఏపీ నుంచి రాజ్యసభలో ఆధిపత్యం చూపిన వైసీపీకి ఇది గణనీయమైన మార్పుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇదే సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ సీట్లు కూటమికే దక్కే అవకాశాలు దాదాపు ఖరారైనట్లు సమాచారం. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం కారణంగా ఈ సీట్లపై కూటమికి పూర్తి ఆధిక్యం ఉంది. దీంతో ఏపీ నుంచి రాజ్యసభలో కూటమి బలం ఏడు వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.రాజ్యసభకు కూటమి తరపున టికెట్లు ఎవరికి దక్కుతాయన్న అంశంపై ఇప్పటికే లోపల పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. టీడీపీ , జనసేన , బీజేపీల నుంచి ఆశావహులు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఎవరు పోటీ చేసినా ఎంపీలు మాత్రం కూటమి నుంచే వెళ్లడం ఖాయమని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో కూడా పలువురు సీనియర్ నేతలు ఈ ఏడాది రిటైర్ అవుతున్నప్పటికీ, ఏపీ రాజకీయాలపై వాటి ప్రభావం పరిమితంగానే ఉంటుందని అంటున్నారు. అయితే బీజేపీ ఎన్డీయే ) అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఎక్కువగా ఉండటంతో రాజ్యసభలో వారి బలం పెరిగే అవకాశం ఉంది. దాని ప్రభావం పరోక్షంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపైనా కనిపించే సూచనలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే, ఈ ఏడాది రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ దిశను కొత్త మలుపు తిప్పే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వైసీపీకి బలం తగ్గడం, కూటమికి ఆధిక్యం పెరగడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణలకు దారి తీస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌జేడీ, యూబీటీ, ఎన్‌సీపీ పూర్తిగా రాజ్యసభలో లేకుండా పోతాయి. ఆర్‌జేడీ బిహార్ సీటు, యూబీటీ ప్రియాంక చతుర్వేది, ఎన్‌సీపీ అజిత్ పవార్‌వర్గ సీటు కోల్పోతాయి. ఉపేంద్రగోస్వామి పదవీ ముగింపు తర్వాత బీజేపీతో సంబంధాలు పునరుద్ధరించుకుంటున్నారు,మహారాష్ట్రలో, అధికార మహాయుతి కూటమిలో సీట్ల భాగస్వామ్యం కీలకం అవుతుంది, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మరియు సునేత్రా పవార్ నేతృత్వంలోని వర్గం మధ్య చర్చలు ఫలితాలను నిర్ణయిస్తాయని భావిస్తున్నారు. బీహార్‌లో, లోక్ జనశక్తి పార్టీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ పెరుగుతున్న ప్రభావం కూడా తుది అంకగణితంలో ఒక అంశంగా మారే అవకాశం ఉంది.ప్రతిపక్షాలకు మహారాష్ట్ర ఒక సవాలుగా ఉంటుంది, శరద్ పవార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలోని ఆయన వర్గం నుండి ఫౌజియా ఖాన్, శివసేన నుండి ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ నుండి రజనీ పాటిల్ వంటి ప్రముఖ నాయకులు తమను ఎన్నుకుంటారని ఆశిస్తున్నారు. ఒకే ఒక అభ్యర్థికి మాత్రమే గెలిచే అవకాశం ఉంది మరియు ఖచ్చితమైన సీటు కోసం పోటీ తీవ్రంగా ఉంటుంది.ఈసారి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనని శరద్ పవార్ గతంలో చెప్పినప్పటికీ, ఇప్పుడు ఆయన పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇండియా అలయన్స్ కు రెండో నిరాశ బీహార్ నుంచి ఎదురయ్యే అవకాశం ఉంది, అక్కడ కూడా ఒకే అభ్యర్థి గెలవగలరు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల దారుణమైన ప్రదర్శన తర్వాత, వారు మరో రెండు స్థానాలను కోల్పోయే అవకాశం ఉంది.మూడు సీట్లు ఖాళీగా ఉన్న అస్సాం మరియు నాలుగు సీట్లకు ఎన్నికలు జరిగే ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలలో కూడా బిజెపి స్పష్టమైన ఆధిక్యాన్ని కలిగి ఉంది.హర్యానా ఛత్తీస్‌గఢ్‌లలో కూడా ఆ పార్టీ అనుకూలమైన స్థితిలో ఉంది, అక్కడ రెండు స్థానాలు చొప్పున గెలుచుకోనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో, బిజెపి కనీసం ఒక స్థానాన్ని గెలుచుకుంటుందని భావిస్తున్నారు, అయితే తమిళనాడులో ప్రస్తుత బ్యాలెన్స్ మారదు. భారత కూటమికి తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ నుండి మాత్రమే ఉపశమనం లభిస్తుంది. తమిళనాడులో, వారు గరిష్ట సంఖ్యలో సీట్లు పొందుతారని భావిస్తున్నారు.తమిళనాడులోని ఆరు సీట్లలో నాలుగు డీఎంకేకు, పశ్చిమ బెంగాల్‌లోని ఐదు సీట్లలో నాలుగు తృణమూల్ కాంగ్రెస్‌కు వెళ్తాయి. తెలంగాణలోని రెండు స్థానాలను, ఛత్తీస్‌గఢ్ మరియు హర్యానాలలో ఒక్కొక్క స్థానాన్ని, హిమాచల్ ప్రదేశ్ నుండి ఒకే ఒక స్థానాన్ని కాంగ్రెస్ నిలుపుకుంటుంది. 245 మంది సభ్యులున్న ఎగువ సభలో ప్రతిపక్షానికి 79 మంది ఎంపీలు ఉన్నారు కాంగ్రెస్ నుండి 27 మంది, తృణమూల్ కాంగ్రెస్ నుండి 12 మంది, డిఎంకె నుండి 10 మంది, ఆర్జెడి నుండి 5 మంది, సమాజ్ వాదీ పార్టీ మరియు సిపిఎం నుండి 4 మంది, మరియు ఇతర ప్రతిపక్ష పార్టీల నుండి ఎంపీలు ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిలో, ఇండియా అలయన్స్ నుండి గరిష్టంగా 14 మంది అభ్యర్థులు గెలవగలరు.ఇది మొదటిసారి ప్రధాన విపక్షాలకు 'జీరో ఎంపీలు' స్థితిని తెచ్చిపెడుతుంది. నీరజ్ దాంగీ, అభిషేక్ సింఘ్వీ, మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్ పదవీలు ముగుస్తున్నాయి. ఎమ్మెల్యే బలం లేకపోవడంతోమళ్లీ ఎంపిక అసాధ్యం. ఖర్గేకు మరో అవకాశం ఉండవచ్చు. కానీ దాంగీ రాజస్థాన్ లేదా హిమాచల్ అవకాశాలు మాత్రం అనిశ్చితంగా ఉన్నాయి, ఇది వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ బలం కొనసాగినా, మిగతా రాష్ట్రాల్లో బీజేపీ-మిత్రాలు ఆధిక్యం సాధిస్తాయి. అసెంబ్లీ ఎన్నికలు జరగకపోతే ప్రతిపక్షాలు రాజ్యసభలో బలహీనపడతాయి, ఇది బీజేపీకి చట్టాల ఆమోదంలో స్వేచ్ఛను ఇస్తుంది.




## కల్తీ పాలు తాగి నలుగురు మృతి

సహాయం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరడం స్థానికంగా కలకలం రేపుతోంది. కల్తీ పాల సరఫరాకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. బాధితుల కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని అధికారులను సూచించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లాలాచెరువు చౌడేశ్వరినగర్ ప్రాంతంలో పాలు తాగడంతో కిడ్నీలు ఫెయిలై ప్రాణాలు పోతున్నాయి. ఇదివరకే ఇద్దరు చనిపోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్లో సోమవారం ఉదయం మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతులను రాధాకృష్ణమూర్తి (74), ఎన్. శేషగిరిరావు (72)గా అధికారులు గుర్తించారు. తాజా మరణాలతో కలిపితే మొత్తం నలుగురు వ్యక్తులు కిడ్నీలు ఫెయిలై చనిపోయారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇదిరకే భాగిశెట్టి కనకరత్నం, తాడి కృష్ణవేణి అనే ఇద్దరు వృద్ధులు పాలు తాగడంతో కిడ్నీలు ఫెయిలై చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ 15వ తేదీ తర్వాత నుంచి ఒక్కొక్కరుగా అస్వస్థతకు లోనయ్యారు. వారిలో ఇదివరకే ఇద్దరు చనిపోగా, తాజాగా మరో ఇద్దరు చనిపోవడంతో స్థానికంగా ఆందోళన చెందుతున్నారు. చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 12 మంది వాంతులు, పొట్ట ఉబ్బడం, మూత్రవిసర్జన కాకపోవడం వంటి తీవ్రమైన లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరారు. పలు ఆస్పత్రుల్లో చేరి బాధితులు చికిత్స పొందుతున్నారని, కిడ్నీ ఫెయిలై చనిపోయినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులతో పాటు ఐదు నెలల పసికందు, మూడేళ్ల బాలుడు ఉన్నాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. బాధితులందరికీ కోరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే వ్యక్తి పాలు పోస్తున్నట్లు అధికారులు గుర్తించారు. శివరాత్రి రోజున పాలు, పెరుగు చేదుగా ఉన్నాయని బాధితులు తెలిపారు. కల్తీ పాలు తాగడమే వారి అనారోగ్యానికి కారణమని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిందితుడు గణేష్ను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను ఇప్పటికే టాక్సికాలజీ పరీక్షల నిమిత్తం పంపించారు. ఆ నివేదికలు వచ్చిన తరువాతే కిడ్నీలు ఫెయిల్ కావడానికి, వారి మరణాలకు ఆ పాలు కారణమా లేదా వేరే కారణాలు ఉన్నాయా అనేది తేలనుంది.

## బకాయిలు విడుదల చేయాలి

జోగులాంబ గద్వాల్ లో జరిగిన రైతు సంఘర్షణ సభలో ఆమె మాట్లాడారు. నడిగడ్డ సీడ్ పత్తి రైతులకు వారంలోగా బకాయిలు చెల్లించాలి. లేదంటే రైతులందరితో కలిసి గద్వాల్ దీక్ష చేపడతాం. తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు చూసి నత్తలు కూడా సిగ్గుపడుతున్నాయి. నడిగడ్డ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసింది. కాంగ్రెస్ కూడా అన్యాయం చేస్తోంది. రైతుల గురించి నిలదీసే కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని కోరుతున్నాని అన్నారు. నాగర్ కర్నూల్ లో కూలం పేరుతో దూషించి కొట్టటంతో రెండు నెలల చిన్నారి చనిపోయింది. ఈ సంఘటన చాలా బాధ కలిగించింది. పాప మృతికి సంతాపంగా మౌనం పాటిద్దాం. ఇలాంటి కుల వివక్ష మన తెలంగాణలో ఉండకూడదు. జోగులాంబ అమ్మవారంటే నాకు చాలా సెంటిమెంట్ ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏ కీలకమైన కార్యక్రమమైనా ఉత్తర తెలంగాణ నుంచి ప్రారంభమయ్యేది. కానీ జాగృతి తరపున భవిష్యత్ లో ఏ కార్యక్రమం జరిగిన సరే జోగులాంబ గద్వాల్ నుంచే ప్రారంభిస్తాం. ఎందుకంటే నడిగడ్డ ప్రజలు నీతి, నియత్ ఉన్న మంచివాళ్లు. అలాంటి ప్రజల నుంచి గడ్డ నుంచి ఏ కార్యక్రమం మొదలు పెట్టిన సరే అమ్మవారి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు. మహిళలు లేకుండా ఏ పంట కూడా చేతికి రాదు. బకాయిలు చెల్లిస్తామంటూ కలెక్టర్ ముందు చెప్పిన సరే ఆ తర్వాత ఇవ్వటం లేదు. సీడ్ పత్తి రైతులకు వారం రోజుల్లో బకాయిలు విడుదల చేయాలి. లేదంటే తెలంగాణలో రైతులందరితో కలిసి ఈ ప్రాంతంలో దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. అందరూ కూడా ఇద్దరు అన్నలకు భయపడుతారు. ఒకటి అడవిలో అన్నకు, రెండోది రైతన్నకు. కానీ ఓ వైపు అడవిలో అన్నలను అత్యంత అమానవీయంగా చంపేస్తున్నారు. రైతన్నను కూడా దారుణంగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అర్ధరాత్రి కరెంట్ ఇవ్వటంతో రైతులంతా కుటుంబాన్ని వదిలి రాత్రి పూట పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. పాములు, తేళ్ల భయంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. యాప్ ద్వారా రైతులు యూరియా బుక్ చేసుకోవాలంట. రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు లేవు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సోనియమ్మ పుట్టిన రోజు నాడు రుణమాఫీ అని ప్రకటించింది. కుటుంబంలో ఉన్న అందరూ 2 లక్షలు రుణం తెచ్చుకోవాలని రేవంత్ రెడ్డి చెప్పిండు. కానీ రైతులందరికీ మాత్రం రుణమాఫీ చేయలేదు. 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి 25 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేశారు. ఇంకా 15 లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. 50 వేలు, లక్ష రుణం తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ కావటం లేదు. రైతు భరోసా వేశాక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పెడతానని సీఎం చెబుతున్నాడు. రైతు భరోసా అనేది ఎన్నికలకు ఇచ్చే గిఫ్ట్ మాదిరిగా చేస్తున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రైతు గుర్తుకు వస్తున్నాడు. సర్పంచ్ ఎన్నికల్లో నారాణయ పేట్ దగ్గర మా తమ్ముడు గవినోళ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఎన్నికల్లో జాగృతి బోణీ కొట్టింది. మున్సిపల్ ఎన్నికల్లో కూడా వడ్డెపల్లి మున్సిపాలిటీని గెలుచుకున్నాం. గద్వాల్ నుంచే జాగృతి జైత్రయాత్ర మొదలైందని అన్నారు. ఏ పార్టీలో గెలిచినా సరే ముఖ్యమంత్రి వాళ్లను తమ పార్టీలోకి లాక్కుంటున్నాడు. గద్వాల్ జిల్లాలో ఇలాంటి పిచ్చి రాజకీయాలు నడుస్తున్నాయి. గద్వాల్ లో ఉన్న ఎమ్మెల్యే రేపు ప్రెస్ మీట్ పెట్టి ఏ పార్టీలో ఉన్నారో చెప్పండి. ఏ పార్టీలో ఉన్నావో చెప్పలేని ఎమ్మెల్యే ఎందుకు? అలాంటి వ్యక్తి ప్రజలకు ఏమీ చేస్తాడో ఎలా చెప్పగలడు? నన్ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తే...ఎమ్మెల్సీ పదవికి నిమిషాల్లో రాజీనామా చేశా. రాజకీయాలు చేయాలంటే ధైర్యం, నియత్ ఉండాలి. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు మనల్ని దాటుకొని వెళ్తున్న సరే నీళ్లు రావటం లేదు. తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు నత్త నడకన సాగుతున్నాయి. నత్తాలు కూడా సిగ్గుపడుతున్నాయి. ఇలా అయితే నడిగడ్డకు నీళ్లు ఎప్పుడు రావాలి. రైతులు గుండె మీద చేయి వేసుకొని ఎప్పుడు హాయిగా ఉండాలి? నడిగడ్డను పూర్తిగా అన్యాయం చేసి మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాంతానికి న్యాయం చేయటంలో ఫెయిల్ అయ్యింది. అందుకే మీకోసం నిలదీసే ఆయుధాన్ని సిద్ధం చేస్తున్నాం. మీ ఆశీస్సులు కావాలి. గద్వాల్ జిల్లాలో అత్తా, అల్లుడే కాదు కొత్త నాయకత్వం కూడా రాబోతోంది. మీకోసం కొట్లాడుతున్న రంజిత్ ను మీరు కచ్చితంగా గెలిపించుకోవాల్సిన అవసరముందని అన్నారు. త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రాబోతున్నాయి. మళ్లీ డబ్బుల మూటలతో వస్తారు. వారిచ్చే డబ్బులు తీసుకోండి. అవి మీ నెత్తి కొట్టి సంపాదించిన డబ్బులే. కానీ ఓటు మాత్రం మీ కోసం పనిచేసే వారికే వేయండి. రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడదు. ఈ ప్రభుత్వం రైతును ఏడిపిస్తోంది. కచ్చితంగా ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు. రైతుల సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చేందుకు అందరం కలిసి వెళ్దాం. రైతుల కోసం మిట్ట మధ్యాహ్నం జాగృతి వాళ్లు నడుస్తున్నారని అందరికీ తెలియాలి.

## 25 నుంచి ఇంటర్ పరీక్షలు

కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. మాస్ కాపీయింగ్కు ఏమాత్రం అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని... అలాగే మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపమని, పరీక్షా పత్రాలను కూడా అప్పటి వరకు బయటకు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.ఇక హాల్ టికెట్ల విషయంలో తలెత్తిన వివాదాలపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

# దుష్టుల సింహ స్వప్నం.. యాదగిరి శ్రీలక్ష్మీ నృసింహుడు

- గోవర్ధనగిరి ధారిగా నరసింహుడు
- నేడు శ్రీ స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23:**

వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభువుగా వెలసిన యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వైకుంఠాన్ని తలపిస్తోంది. సోమవారం బ్రహ్మోత్సవాలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ప్రతిరోజు వివిధ అలంకరణ సేవలు ఆధ్యాత్మికతతో వెలుగొందుతున్నాయి.

**గిరిధర.. మము బ్రోవర**

ఎడమ చేతి చిటికెన వేలి పై గోవర్ధనగిరిని ఎత్తి పట్టుకొని యాదవులను, ప్రజలను, గోవులను రక్షించిన అలంకరణ రూపంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉదయం భక్తులకు దర్శనం ఇచ్చారు. కోపానికి గురైన ఇంద్రుడు ఏక ధాటిగా వర్షం కురిపిస్తూ... ప్రకృతి వైపరీత్యాన్ని కలిగించినప్పుడు ప్రజల మొర వినిన శ్రీకృష్ణుడు ఏడు రోజులపాటు గోవర్ధనగిరిని ఎత్తి ప్రాణాలను రక్షించారు. ఆనాడు గోపాలురను రక్షించిన తరహాలోనే ఈనాడు తమను కూడా ఈతి బాధల నుంచి రక్షించాలని కోరిన కోరికలు తీర్చాలని భక్తులు ఎందరో ఈసందర్భంగా స్వామి వారికి నమస్కరించి వేడుకున్నారు. మాడవీధులలో జరిపిన గోవర్ధనగిరి అలంకరణ సేవ ఊరేగింపు తిలకించినవారు అధ్యాత్మిక ఆనందంలో పులకించారు.

**సింహ వాహనంలో..**

దుష్టులకు సింహ స్వప్నమైన నృసింహ స్వామి వారు... శిష్టజనుల రక్షణ కోసం రాత్రి వేళ సింహ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. పరాక్రమానికి తేజస్సుడు, అధిపత్యానికి సంకేతమైన సింహంపై కనిపించి భక్తజనులను తరింపజేశారు. మీకు నేను ఉన్నాను అంటూ ఆత్మ విశ్వాసాన్ని కల్పించారు.

**బ్రహ్మోత్సవాలలో నేడు..**

వార్షిక బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టమైన శ్రీ స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం మంగళవారం రాత్రి 8.45 గంటలకు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ సాయంత్రం అశ్వవాహన సేవ కొనసాగనుంది.

# ఆరు క్రీడా మెడల్స్ అదుర్స్

- యాదగిరిగుట్ట కానిస్టేబుల్ వాసర్ల పావని
- కబడ్డీ, షాట్ పుట్, కుస్తీ పోటీల్లో గోల్డ్ మెడల్స్
- కానిస్టేబుల్ పావనికి యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ ఘనంగా సన్మానం



**జయభేరి, యాదగిరిగుట్ట :**

క్రీడా పోటీలలో మూడు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, మూడు బ్రాంజ్ మెడల్ ను సాధించిన యాదగిరిగుట్ట కానిస్టేబుల్ వాసర్ల పావని నాగేందర్ పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారు.

**క్రీడా ప్రతిభకు నిలువెత్తు రూపం**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వాసర్ల పావని నాగేందర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన క్రీడల్లో అనేక మెడల్స్ సాధించి తన క్రీడా ప్రతిభను చాటుకున్నారు.





**డీఎస్పీ, సీఐ ఘనంగా సన్మానం**

ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచిన వాసర్ల పావని నాగేందర్ ను ఈ సందర్భంగా యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు,సిఐ భాస్కర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సహచర పోలీసులు, అధికారులు ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ఆమె సాధించిన విజయాలు పోలీస్ శాఖకు గర్వకారణమని వారు కొనియాడారు.

**మెడల్స్ వివరాలు..**

కబడ్డీలో గోల్డ్ మెడల్,షాట్ పుట్ లో గోల్డ్ మెడల్,చేయి కుస్తీ పోటీలో గోల్డ్ మెడల్, వాలిబాల్ లో సిల్వర్, బ్యాడ్ మెంటేన్ లో బ్రాంజ్ మెడల్, ఉమెన్ డబుల్స్ లోనూ బ్రాంజ్, మిక్స్ డబుల్స్ బ్రాంజ్ ఇలా మొత్తము ఆరు మెడల్ ని కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉండగా జమ్మూ కాశ్మీర్లో నిర్వహించే కబడ్డీ పోటీలకు పావని ఎంపికయ్యారు. పోలీసు శాఖ ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని పావని అన్నారు. జాతీయస్థాయిలోను పావని తన క్రీడా ప్రతిభను చాటుకోవడానికి సంసిద్ధులవుతున్నారు.


# శ్రామిక మహిళ వసతి భూమికి రక్షణ కరువు

- స.నెం 647 భూమిపై పాగ వేసేందుకు సాగుతున్న అక్రమార్కుల యత్నాలు
- శ్రామిక మహిళ హాస్టల్ నిర్మాణం చేపట్టేది ఇంకెప్పుడు..?
- ప్రభుత్వం వెంటనే హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ప్రజల డిమాండ్.



**జయభేరి, కీసర :**

జి.హెచ్.ఎమ్.సిలో నూతనంగా విలీనమైన కాప్రా మండలంలోని జవహార్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాలనేవి శరమాములే.. వేల ఎకరాల భూములు ఇప్పటికే స్వాహా అయ్యాయి. అయితే ప్రజలకు ఉపయోగపడేందుకు ప్రభుత్వం కేటాయించిన భూములనైన దక్కించుకునే పరిస్థితి జవహార్ నగర్ లో లేక పోవడం అనేది దురదృష్టకరం. విషయానికొస్తే చెన్నాపురం నుండి ఆర్మీ డెంటల్ కాలేజీ వెళ్లేదారిలో వున్న స.నెం 647 ప్రభుత్వ భూమిని శిశు సంక్షేమ శాఖకు అప్పజెప్పుతూ శ్రామిక మహిళల వసతి గృహా నిర్మాణానికి కేటాయించింది ప్రభుత్వం. 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకునే ఈ స్థలం వుండడంతో అక్రమార్కుల కన్ను భూమిపై పడింది. గతంలో అక్రమకట్టడాలకు ప్రయత్నం చేయగ కూల్చివేతలు చేసారు గత రెవెన్యూ అధికారులు. ఇప్పుడు మళ్ళీ అక్రమ నిర్మాణాలకు సంసిద్ధం అవుతున్నారని విశ్వసనీయ సమాచారం. ఇంకెన్నాళ్ళు వసతి గృహా నిర్మాణానికి సమయం పడుతుంది, మీరు కట్టే లోపు భూమి కనుమరుగవుతుందని ప్రభుత్వ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన కబ్జాకు గురి కాకుండ కట్టుదిట్టమైన చర్యలు రెవెన్యూశాఖ చేపట్టాలని, ప్రభుత్వం వెంటనే హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






# హైకోర్టులో విజయం

- తెలంగాణ ఉద్యమకారులకు శుభవార్త

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ ఉద్యమాభి వందనం ఈరోజు హైకోర్టులో విజయం సాధించిన ఉద్యమకారులకు హృదయపూర్వక శిరస్సు వంచి పాదాభివందనం చేయుచున్నాము. ఉద్యమకారులు అభయ హస్తం కింద అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇంటి స్థలం, ఎనిమిది వారాల్లోపు ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వానికి సీరియస్ వార్నింగ్ ఇచ్చి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఇంప్లిమెంట్ చేయాలని హైకోర్టు ఆర్డర్ కాపీ ఇచ్చినారు ఈ విజయం సాధించిన ఉద్యమకారుల తొలి విజయంగా భావించుచున్నాము అని మాజీ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జరుపుల లోక్య నాయక్ తెలియజేసినారు.

# సాంకేతికత వినియోగంలో తెలంగాణ ముందంజ

- జీకేఆర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

పంటల సాగులో సాంకేతికత వినియోగంలో తెలంగాణ ముందంజలో ఉందని జికేఆర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోన రాజశేఖర్ అన్నారు. ఏఐ ఆధారంగా మట్టి పోషకాలు విశ్లేషించి పంటలకు సరైన ఎరువులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. యూరియా యాప్ లో బ్లాక్ మార్కెటింగ్ అడ్డుకట పడనుందన్నారు. శాటిలైట్ డేటా తో పంటల మానిటరింగ్ తో పాటు టెక్నాలజీ వినియోగంలో రైతుకు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని కోన రాజశేఖర్ అన్నారు.




# హెల్మెట్ ధరించే వాహనాలు నడపాలి

- ట్రాఫిక్ సీఐ ఎలకొండ కృష్ణ

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 :**

ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులపై హెల్మెట్ ధరించడంపై అవగాహన ఈ కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు ఎలాంటి హెల్మెట్లు ధరించాలి, హెల్మెట్లు ధరించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా ఎలా కాపాడుకోవాలనే అంశాలపై వివరించారు. హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు,దాని పర్యావరాణ,ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య ఖర్చులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంకులలో పెట్రోల్ పోయరని తెలిపారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# కార్పొరేటర్ ఆవేజ్ అహ్మద్ కు సన్మానం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కార్పొరేషన్ లోని 47వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా గెలుపొందిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవేజ్ అహ్మద్ కు సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి గోవర్ధన్ నాయి శాలువా కప్పి సన్మానించారు.

# భక్తులకు అన్న ప్రసాద వితరణ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్నేళ్ళుగా దేవాలయంలో భక్తులు ప్రతి సోమవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో బాగానే స్థానికులు మేదరి బాలకృష్ణ, అంజలి మరియు మేదరి శివ, అంజలి భక్తులకు ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 23 :**

తుర్కపల్లి మండలం దత్తాయ పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 విద్యార్థులు సోమవారం గ్రామంలో నాలుగవ రోజు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లు ఇల్లు తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్లాస్టిక్ వల్ల భూమి కాలుష్యం, జల కాలుష్యం జరుగుతుందని గ్రామస్తులకు వివరించి ప్లాస్టిక్కు నివారించే విధంగా ప్రచార కార్యక్రమాన్ని చేస్తూ ప్లాస్టిక్ వస్తువులను గ్రామానికి దూరంగా వేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కర్ణాకర్, ఎంఎస్ఎస్ క్యాంపు ఆఫీసర్ కనక బాలరాజు, వాలంటీర్స్ సాయి, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 23 :**

కోనాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చు దిద్దుతానని గ్రామ సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో డిఎంఎస్ నిధులనుండి ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కోనాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామాన్ని తీర్చి దిద్దుతానని, ప్రత్యేక నిధులతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికుమార్ ,ఉపసర్పంచ్ నీళ్ల కరుణాకర్, గ్రామపంచాయతీ సెక్రటరీ సందీప్ రెడ్డి, వార్డు సభ్యులు పసుపుల కనకయ్య, అక్కెనపల్లి శ్రీలత బంగారు రెడ్డి, నీల మమత, దుర్గయ్య, పసుల కనకయ్య, మాజీ సర్పంచ్ చాడ గోపాల్ రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ పసుపుల కనకయ్య, గువ్వ నర్సింలు నీల చంద్రయ్య, నీల వెంకటేష్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం అందరూ పొందాలి

**జయభేరి, డిండి :**

ప్రతి ఒక్కరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 39వ బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు, మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి సుభాష్ గౌడ్, స్థానిక సర్పంచ్ షేక్ రఫియాబషీర్, మాజి కో అప్షన్ సభ్యులు జంగిర్, ఉప సర్పంచ్ రాంరెడ్డి, గంగిడి నరేందర్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, లక్ష్మణ్, రామచంద్రం, బషీర్, శ్రీధర్, హనుమంత్, భగవంతు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు కృషి చేయాలి.. ఎంపీడీవో




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 23 :**

గ్రామపంచాయతీలు అభివృద్ధికి వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్లు, వార్డు సభ్యుల రెండో విడత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధిపరిచే అనేక అంశాల గురించి నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ జహంగీర్, సంతోష్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ ఎం సాయి కుమార్, ఎండి అల్తాఫ్, ఎల్ పవన్ కుమార్, బి గణేష్, దార మహేందర్, ఒగ్గు మధు, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అనేక ఉపయోగాలు




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 23 :**

ప్రకృతి వ్యవసాయం తోనే అనేక ఉపయోగాలు ఉన్నాయని ఏఈఓ కావ్య అన్నారు సోమవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ప్రకృతి వ్యవసాయ గురించి రైతులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. గ్రామంలో దడక శ్రీనివాస్ అనే రైతు ప్రకృతి వ్యవసాయం యొక్క అనుభవాలను వివరించారు. అనంతరం 125 మంది రైతుల మేల ఆరోగ్య కాడులను పంపిణీ చేశారు ఈ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో 125 మంది రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను తీసి వాటిని రాజేంద్రనగర్ మట్టి పరీక్షల ల్యాబ్ కు పంపించడం జరిగిందని ల్యాబ్లో వాటి పరీక్షలు జరిపించి వాటికి ఇప్పుడు నేల ఆరోగ్య కార్డులు ఉత్పత్తి చేయడం జరిగిందని అన్నారు. రైతు పొలాల్లో ఉన్న భూసారం ఫలితాలు పోషకాలు పరిమాణం తక్కువ లేదా ఎక్కువ ఉన్నాయని తెలుస్తుందని, ఈ కార్డులో ఉన్న ఫలితాలను బట్టి రైతు ఎంత ఎరువు వేసుకోవాలో తెలుస్తుందని తెలిపారు. ఆ భూమి ఏ పంటకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు కృషి, సఖి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాతృ మూర్తి బాలమని దశదిన కర్మ

**నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి**



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 23 :**

రంగారెడ్డి జిల్లా నందిగామ మాజీ ఉప సర్పంచ్ మేకొంద కుమార్ గౌడ్ మాతృ మూర్తి మేకొంద బాలమణి దశదిన కర్మకు అంతిరెడ్డిగూడ గ్రామంలో హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి కుమార్ గౌడ్ కు మనోధైర్యాన్ని కల్పించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో అంతిరెడ్డి గూడ సర్పంచ్ యాదగిరి,నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రామ్ రెడ్డి,పిఏసిఎస్ మాజీ చైర్మన్ మామిళ విట్టల్,మాజీ ఎంపిటిసిలు దీపల్లె అశోక్ గౌడ్,దామోదర్ రెడ్డి నాయకులు దీపల్లెసురేష్‌గౌడ్,తుమ్మల నర్సిమ,శ్రీశైలం,ఆంజనేయలు,రాజు గౌడ్,దినేష్‌సాగర్,శివాచారి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అందుకే పెరుగుతున్నాయి

**జయభేరి, న్యూ ఢిల్లీ, :**

ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టడంతోనే బంగారం ధరకు రెక్కలు వచ్చాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ అన్నారు. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవన్నారు. ఈ పరిణామాలను ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు గమనిస్తోందని చెప్పారు. ఇక ఇటీవల అమెరికా సుంకాల్లో మార్పుల ప్రభావాన్ని భారత ఆర్థిక వ్యవస్థపై అంచనా వేయడం చాలా తొందరపాటు అవుతుందని పేర్కొన్నారు.

# అతివేగం అత్యంత ప్రమాదకరం

- **పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు**

**జయభేరి, షాద్ నగర్ ఫిబ్రవరి 23**




అధిక వేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని, సురక్షిత డ్రైవింగ్‌కు స్పష్టమైన చూపు ఎంతో అవసరమని తెలియజేస్తూ ట్రాఫిక్ పోలీసులు షాద్ నగర్ లో డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్షలు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని రహదారిపై వెళ్లేటప్పుడు ప్రత్యేక దృష్టి దృష్టితో వెళ్లాలని డ్రైవర్ల కోసం ట్రాఫిక్ పోలీసుల విభాగం ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫ్యూచర్ సిటీ డీసీపీ ట్రాఫిక్ శివం ఉపాధ్యాయ, మహేశ్వరం ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్, షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, టౌన్ సిఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 142 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, వారి చూపు సామర్థ్యాన్ని పరీక్షించి డ్రైవింగ్‌కు తగిన స్థితిలో ఉన్నారో లేదో నిర్ధారించారు. ఈ సందర్భంగా డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే కీలక అంశమని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమాలకు అనుగుణంగా పోలీసు అధికారులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని ఆయన హెచ్చరించారు. మద్యం ప్రభావంలో డ్రైవింగ్ చేయడం వలన డ్రైవర్‌కే కాకుండా ప్రయాణికులు మరియు వారి కుటుంబాలకు కూడా తిరిగి సరిచేయలేని నష్టం కలుగుతుందని అన్నారు. కాబట్టి వాహనం నడపడానికి ముందు పూర్తిగా మద్యాన్ని నివారించాలని సూచించారు. మద్యం ప్రభావం వల్ల తీర్మాన సామర్థ్యం తగ్గిపోవడంతో తీవ్రమైన ప్రమాదాలు, మరణాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై పాల్గొన్న వారికి వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలి అని సూచించారు. అదనంగా, అధిక వేగం, సిగ్నల్ జంపింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే దృష్టి మళ్లింపు, అలసటతో డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. కార్యక్రమం చివరలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు భద్రతకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు.



## మార్చి 1న ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక

- **దేవరకద్ర కల్వ కన్నయ్య శెట్టి**

**జయభేరి, దేవరకద్ర :**

మార్చి 1న జిల్లా ఆవోప మహబూబ్ నగర్ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు దేవరకద్ర వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్, ఆర్యవైశ్య నాయకుడు కల్వ కన్నయ్య శెట్టి తెలిపారు. మహబూబ్ నగర్ లోని వాసవి గార్డెన్ లో ఆరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి గాను రిజిస్ట్రేషన్లు ప్రారంభం కావడం జరిగిందన్నారు. ఈ రిజిస్ట్రేషన్లకు ఊహించిన దాని కన్నా ఎక్కువ స్పందన రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య పెద్దలు, సోదరీమణులకు అధ్యక్షుడు పాపిశెట్టి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుమ్మడవల్లి భాస్కర్, ఆర్థిక కార్యదర్శి కొండూరు నర్సింలు కృతజ్ఞతలు తెలపడం జరిగిందన్నారు.ఈ వివాహ పరిచయ వేదికకు ఆర్యవైశ్య పెండ్లి ఈడు కలిగిన అమ్మాయి, అబ్బాయిలకు ఇది ఒక మంచి అవకాశమని కల్వ కన్నయ్య శెట్టి అన్నారు. దీనిని ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం

- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**



**జయభేరి, దేవరకద్ర :**

అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం లభించినట్లు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మొదటిసారి నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంపై ప్రసంగించాలని అట్టి ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు. భారతదేశం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరికి ఆహ్వానం అందడం విశేషం అన్నారు. డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూటర్ కారిడార్స్ ప్రభావం పై ప్రధాన చర్చ అక్కడ ఉంటుందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

## ఆశా వర్కర్ల నిరసన

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్, కోఠిలోని డీఎంహెచ్వో కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు భారీ నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా తమకు జీతాలు అందడం లేదని, కనీస వేతనం 18,000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో భాగంగా ఒక ఆశా వర్కర్ స్పృహ తప్పి పడిపోవడంతో, వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

# రాష్ట్రవ్యాప్తంగా రజకుల సంఘాల ఆందోళనలు

- **దాడికి పాల్పడిన దుండగురిని వెంటనే అరెస్టు చేసి అరెస్ట్ చేయాలి**

**జయభేరి, గజ్వేల్, వర్గల్ :**



నాగర్ కర్నూల్ జిల్లాలో చిన్నారి ఘటన దురదృష్టకరం అని, చిన్నారి మృతికి కారణమైన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వర్గల్ రజక సంఘం నాయకులు కొవ్వత్తి వెలిగించి నిరసన చేపట్టారు.నాగర్ కర్నూల్ జిల్లా మల్లన్న జాతరలో చిన్నారి గాయపడి, మృతి చెందిన ఘటనకు నిరసనగా సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన వర్గల్ లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. నేటికి కులాల పేరిట చిన్నారిని దూషించి తన్నడం బాధాకరమని రజకులు ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్నారి ఘటనను చూస్తే మనం ఏ కాలంలో ఉన్నామోననే భయాందోళన ఉందన్నారు. అంతేకాక చిన్నారి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి బాధితులపైనే పోలీసులు కేసు నమోదు చేయడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశిస్తున్నారు.

ఇకనైన ప్రభుత్వం చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో రజక సంఘం తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రమేష్ ముదిరాజ్,రజక సంఘం నాయకులు సత్యనారాయణ, పెంటయ్య, గోపాల్, వెంకటేష్, స్వామి, ఎల్లం, కృష్ణ, రాజు, తీర్మాల్, భాస్కర్, రాజు. రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ములుగు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు.**

**జయభేరి, గజ్వేల్ ఫిబ్రవరి 23 :**



నాగర్ కర్నూల్ జిల్లాలో చిన్నారి ఘటన దురదృష్టకరం అని, చిన్నారి మృతికి కారణమైన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రజకులు ములుగు రాజీవ్ రహదారిపై నిరసన చేపట్టారు.నాగర్ కర్నూల్ జిల్లా మల్లన్న జాతరలో చిన్నారి గాయపడి,మృతి చెందిన ఘటనకు నిరసనగా సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగు రాజీవ్ రహదారిపై రజక సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్,బీసీ కుల సంఘాలతో కలిసి ధర్నా, ర్యాలీ నిర్వహించారు. నేటికి కులాల పేరిట చిన్నారిని దూషించి తన్నడం బాధాకరమని రజకులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి ఘటనను చూస్తే మనం ఏ కాలంలో ఉన్నామోననే భయాందోళన ఉందన్నారు. అంతేకాక చిన్నారి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి బాధితులపైనే పోలీసులు కేసు నమోదు చేయడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశిస్తున్నారు. ఇకనైన ప్రభుత్వం చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కారకులపై చర్యలు తీసుకోవాలని ములుగు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు.. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు భూమన్న కనకరాజు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మహేష్,ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాజు, సహాయ కార్యదర్శి భాస్కర్, నవీన్, నాగరాజు, ఆంజనేయులు,రవి,వెంకటేష్,ప్రవీణ్,బాబురావు,నవీన్,ఆంజనేయులు,గోపాల్,మహేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్ పెళ్లిరోజు వేడుకలు

- **పెళ్లిరోజు శుభాకాంక్షలు తెల్పిన - చెట్టి హరికాంత్ గుప్తా.**

**జయభేరి, మేడిపల్లి, ఫిబ్రవరి 22 :**



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్ పెళ్లిరోజు వేడుకలు వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ డివిజన్ జనరల్ సెక్రటరీ చెంగిచెర్ల వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు చెట్టి హరికాంత్ గుప్తా కుటుంబ సభ్యులు వెంకటేశ్వర కాలనీవాసులతో కలసి కొత్త లక్ష్మి రవిగౌడ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెల్పిన కేక్ కట్ చేసి గజమాల శాల్వతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న. కుమార్ ముదిరాజ్,పల్సం సోమన్న గౌడ్,ఎస్.వెంకట్ రెడ్డి,పృథ్వీ కుమార్, రజినీకర్ రెడ్డి,విజన్దర్ రెడ్డి, డివిజన్ నాయకులు వివిధ కాలనీల అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో రుగ్మతలకు పరిష్కారం

- దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలని బిజెపి ప్రయత్నం చేస్తుంది
- ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పని చేయాలి రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. "కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి" అన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారు అని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు.

ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదు అన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.

దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బిజెపి కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు.

కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమంలో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు.

కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని TK మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయాల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరానితనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు.

ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ కు అండగా ఉంటా..

- వార్డు అభివృద్ధికి కృషి చేస్తా
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బిజెపి కౌన్సిలర్ అశోక్
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడతానన్న ఎమ్మెల్యే





**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 23 :**

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు శరవేగంగా చేయడం చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. 9వ వార్డు బిజెపి కౌన్సిలర్ ప్యాట అశోక్ కు అండగా నిలిచి దాదాపు ఏడుకోట్ల రూపాయల అభివృద్ధి పనులను వార్డులో చేపడతామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్ ఎమ్మెల్యే శంకర్ ను స్థానిక మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, అదేవిధంగా మాజీ జెడ్పీటిసి శ్యాం సుందర్ రెడ్డిలను కలిసి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ...బిజెపి కౌన్సిలర్ అశోక్ వార్డు అభివృద్ధి కోసం తనను కలిశారని తాను కూడా స్పందించానని 9వ వార్డులో సుమారు 7 కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఈ పనులను జాగ్రత్తగా చేసుకోవాలని అశోక్ కు సూచించినట్లు ఎమ్మెల్యే అన్నారు.ఎన్నికలప్పుడే రాజకీయాలని ఆ తర్వాత కలిసి అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఇస్నాతి గంగాదర్, కొందుర్గు మండల బిజెపి అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు అల్లం అనిల్ కుమార్ గౌడ్, కొంకల్ల మనికంఠ, రమేష్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, చందు గౌడ్ తదితరులు ఉన్నారు..

# పంట వివరాలు స్పష్టంగా నమోదు చేయండి

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 23 :**



పంట నమోదు,ఫార్మర్ రిజిస్ట్రేషన్ వివరాలను స్పష్టంగా పకడ్బందీగా నిర్వహించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం,వ్యవసాయ శాఖ ఆదేశానుసారం వ్యవసాయ విస్తరణ అధికారులు వాలంటీర్ ల సహాయంతో గ్రామాల్లోకి వెళ్లి పంటల నమోదు చేయాలని కోరారు. అదేవిధంగా రైతు నమోదు ( ఫార్మర్ రిజిస్ట్రేషన్) వేగవంతం చేయాలని తెలిపారు.ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ తో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.అలాగే యూరియా కొరత లేకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ అదనపు సంచాలకులు రమాదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## వసతుల లేమిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఈటెల

- మురహరిపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను సందర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్
- ప్రభుత్వం స్పందించక పోతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరిక

**జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 23:**

డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లా మురహరిపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎంపీ ఈటల సందర్శించారు. అనంతరం నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇక్కడికి రావడం ఐదవ సారి అని, ఇక్కడి సమస్యలను అధికారులు మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేదని అవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ముఖ్యంగా విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, మరియు సివిల్ వర్క్స్ ఇలా చాలా పనులు పెండింగ్ లో ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపడం లేదని ఆరోపించారు. అంతేకాక ఇక్కడ రవాణా సౌకర్యాలు కూడా సరిగా లేవని, ఇల్లు ఇచ్చిన కూడా మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల్లోగా ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణ సిద్ధం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఇక్కడి సమస్యలు పరిష్కరించే వరకు వారికి అండగా ఉంటామని ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు.




# సాయిప్రతాప్ ని వెంటనే అరెస్టు చేయాలి

- వర్గల్ మాజీ ఉపసర్పంచ్ పసుల రమేష్ ముదిరాజ్.

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 23 :**

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోతుందని ఇప్పటికే మహిళలపై నేరాలకు పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వర్గల్ మాజీ ఉపసర్పంచ్ పసుల రమేష్ ముదిరాజ్ పేర్కొంనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో సంఘటన వెలుగులోకి వచ్చిందిని ఓ షాప్ కు వెళ్లిన శ్రావణి అనే వివాహిత పై సాయి ప్రతాప్ అనే యువకుడు చెప్పరాని చోటు తన ఇష్టం వచ్చినట్లు కొరికి తన కామ కోరికలను తీర్చుకున్నాడని వారు తెలిపారు. ఇలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# నల్గొండ జిల్లా జెడ్పీ హెచ్ఎస్ తీదేడులో విధి నిర్లక్ష్యం


ORIGINAL
INSTITUTION OF LOKAYUKTA OF TELANGANA
HYDERABAD
RECEIPT
No. 6087
Date 23/2/2026
Received Rupees One hundred and fifty only
from Sri Dharanipati Rama Rao, S/o D. Bhaskar, H.no.3-51/1, Tidedu (venkatampeta) chintapalli (M), Nalgonda (D) 9951179320.
towards Complaint fee
relating to Fresh Complaint
₹ 150/-
Accounts Officer

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల తీదేడులో జరిగిన తీవ్రమైన విధి నిర్లక్ష్యంపై మాజీ ఉపసర్పంచ్ శ్రీ ధరణి పతి రమణారావు, వార్డ్ మెంబర్ మర్ల యాదగిరి (వెంకటం పేట) తదితరులు తెలంగాణ లోకాయుక్తకు సమగ్ర ఫిర్యాదు సమర్పించారు. 96 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో హెడ్మాస్టర్ సహా 7 మంది ఉపాధ్యాయులు ఒకేసారి విహారయాత్రకు వెళ్లడంతో జనవరి 27 నుండి 29 వరకు పాఠశాల నిర్వహణ పూర్తిగా స్తంభించిపోయింది. 10వ తరగతి ప్రాక్టీస్ పరీక్షలు సైతం సక్రమంగా నిర్వహించబడలేదు. డీఈవో జారీ చేసిన డిప్యూటేషన్ ఉత్తర్వులను హెడ్మాస్టర్ పాటించడం లేదని ఫిర్యాదులో తెలిపారు. అంతే కాకుండా ప్రాథమిక పాఠశాల ఎర్రమట్టితండాలో ఒక ఉపాధ్యాయుడు 2018 నుండి 2024 వరకు విధులకు హాజరు కాకుండానే జీతాలు పొందినట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాఠశాల మూతపడి గ్రామంలోని చిన్నారులు విద్యకు దూరమయ్యారు. జిల్లా కలెక్టర్, డీఈవో, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌లకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి సమగ్ర చర్యలు తీసుకోబడలేదని ఆరోపిస్తూ, లోకాయుక్త స్వతంత్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు ఉపాధ్యాయులపై కఠిన క్రమశిక్షణాత్మక చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.



# ముడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం

- సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తాం - చైర్మన్ జాం రవి

**జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 23:**

అధికారులకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం, మున్సిపల్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం, పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాం రవి మాట్లాడుతూ ముడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. అదేవిధంగా అధికారులు, నేతలు ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మున్సిపల్ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ శశిరేఖ, కమిషనర్ పవన్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం

- వేడుకల్లో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 23:**

శామీర్ పేట మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కాగా ఈ వేడుకలకు మేడ్చల్ నియోజక వర్గ ఇంచార్జీ చామకూర మహేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఈ వేడుకలను తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా ఈ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రజకులపై దాడి చేసిన అగ్రకులాల వారిని కఠినంగా శిక్షించాలి

- సామాజికవేత్త బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్,
- రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆమంచి అంజయ్య డిమాండ్ చేశారు



**జయభేరి, చింతపల్లి :**

దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు రజక సంఘం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకొని దాడి చేసి రెండు నెలల పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆమంచి అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మల్లన్న దేవుని దర్శనానికి వెళ్తుండగా కొంతమంది అగ్రకులాల వారు అడ్డుకొని నానా బూతులు మాట్లాడుతూ.. దారుణంగా కొట్టి రెండు నెలల పసిపాప ఉన్నదని కనికరం లేకుండా వారి మీద దాడి చేసి అస్వస్థతకు గురి కావడంతో రెండు నెలల పాప మరణానికి కారకులైన వారిని తక్షణమే దోషులను కఠినంగా శిక్షించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలు పునరావతం కాకుండా తీసుకోవాలని కోరారు తిరిగి పునరావృతం అయితే సహించేది లేదని వారిపై సమాజాదూషణ అత్యా నేరం రెండు రకాల కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చూడాలని చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ చెల్లేటి భాస్కరాచారి, రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్, పగిళ్ల బుచ్చయ్య, నారాయణ, శ్యామ్, భూషరా జు అనిల్, సంతోష్, హరి, అనిల్, రాంబాబు, కుమార్, దశరథం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ పోలీస్ స్టేషన్ వద్దకు..

స్టేషన్లో షూరిటీలు ఇవ్వడానికి ర్యాలీగా వచ్చిన రోహిత్ రెడ్డి

**జయభేరి, తాండూరు :**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జరిగిన గొడవలో నమోదైన కేసులో భాగంగా హైకోర్టు నుండి బెయిల్ పొందిన తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తో పాటు మరో ఏడుగురు తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్లో హైకోర్టు బెయిల్ కు సంబంధించి షూరిటీలు ఇవ్వడానికి ర్యాలీగా వచ్చిన టిఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు బిఆర్ ఎస్ మధ్య హల్చల్ వాతావరం నెలకొంది. అనుమతి ఉన్న వ్యక్తులకే పోలీసులు లోపలికి అనుమతించడంతో న్యాయవాది తో, పైలెట్, పాటు ఏడుగురు పట్టణ సిఐ ముందు షూరిటీలు సమర్పించారు.



## ‘బ్లడీ రోమియో’తో రొమాన్స్?

ఒక్క భారీ హిట్ చాలు కథానాయికల జాతకం మారిపోవడానికి. బాలీవుడ్ హీరోయిన్ త్రిప్తి డిమ్రి విషయంలో అదే జరిగింది. ‘యానిమల్’ సినిమాతో ఈ భామ యువతరంలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అంతకుముందు ఈ సొగసరి హిందీలో ఐదు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. ‘యానిమల్’తో ఒక్కసారిగా అగ్ర కథానాయికల జాబితాలో చేరిపోయింది. ప్రభాస్ ‘స్పిరిట్’ చిత్రం ద్వారా ఈ భామ తెలుగులో ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం త్రిప్తి డిమ్రి తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. నాని కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో ‘బ్లడీ రోమియో’ పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. ఇందులో త్రిప్తి డిమ్రిని కథానాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించిందని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.




## జన నాయగన్ విడుదల అప్పుడేనా?


ప్రజాజీవితంలోకి అడుగుపెడుతూ.. ‘జన నాయగన్’ తన చివరి సినిమాగా విజయ్ ప్రకటించిన నాటినుంచి తమిళనాట ఈ సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. నిజానికి ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. సెన్సార్ సర్టిఫికెట్ లభించని కారణంగా చివరి నిమిషంలో సినిమా ఆగిపోయింది. ఫిబ్రవరిలో రిలీజ్ చేద్దామనుకుంటే.. రాజకీయ, వ్యక్తిగత విమర్శలు అధికంగా ఉన్నాయంటూ కొందరు ఈ సినిమాపై కోర్టును ఆశ్రయించారు. కోర్ట్ ఓ రివ్యూ కమిటీని ఏర్పాటు చేసింది. దాని రిపోర్ట్ రాకపోవడంతో ఈ నెలలోనూ విడుదల లేనట్లేనని తేలిపోయింది. ఏప్రిల్‌లో తమిళనాడు ఎన్నికలు జరుగనున్నాయి. ముందుముందు ఎలక్షన్ కోడ్ ఈ సినిమాకు సమస్యగా మారుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఈ సినిమా విడుదలను నిర్మాతలు జూన్‌కి వాయిదా వేసినట్లు వార్తలొస్తున్నాయి. జూన్ 22 విజయ్ పుట్టినరోజు కావడంతో జూన్ 18న సినిమాను విడుదల చేస్తే అన్ని రకాలుగా బాగుంటుందని నిర్మాతలు భావిస్తున్నారట. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి పూజా హెగ్డే కథానాయిక. బాబీడియోల్ ప్రతినాయకుడు. హెచ్.వినోద్ దర్శకుడు. వెంకట్ కె.నారాయణ నిర్మాత.

## దుబాయ్‌కు వెంకీ త్రివిక్రమ్ టీం..!



టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం AK 47’ విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ వంటి హిట్ చిత్రాలకు రైటర్-హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్‌వెంకీ ఇప్పుడు డైరెక్టర్-హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

## అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్..



అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు అల్లు కుటుంబ సభ్యులు.. ఇటీవల అల్లు శిరీష్ పెళ్లికి పసుపు కొట్టే కార్యక్రమాన్ని ఇంట్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అల్లు మెగా కుటుంబ సభ్యులందరూ ఒకే చోట చేరి పసుపును దంచారు. మెగాస్టార్ చిరంజీవి భార్య సురేఖతోపాటు తన కుమార్తె సుస్మిత, కోడలు ఉపాసన, పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా తదితర కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు అల్లు శిరీష్ పసుపు వేడుకలో పాల్గొన్నారు ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇప్పటికే అల్లు శిరీష్ సోషల్ మీడియాలో షేర్ చేసుకోగా కొద్ది క్షణాల్లోనే వైరలయ్యాయి. తాజాగా అల్లు అర్జున్ సతీమణి అల్లు స్నేహా రెడ్డి పసుపు వేడుకకు సంబంధించి మరిన్ని ఆసక్తికరమైన ఫొటోలు షేర్ చేసింది. ఇవి ప్రస్తుతం నెటిజన్లను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



## అందంలో ఊర్వశి..

తెలుగులో ఎన్నో సినిమాల్లో నటించింది. కానీ సరైన బ్రేక్ మాత్రం అందుకోలేకపోయింది. తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఆమెకు ఆశించిన స్థాయిలో సక్సెస్ రాలేదు. హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్. ఇప్పటివరకు తెలుగులో చాలా సినిమాల్లో నటించింది. కానీ ఇప్పటివరకు కేవలం ఒక్క హిట్టు అందుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. ఇప్పుడు సినిమాలకు దూరంగా ఉంటుంది. 2016లో విడుదల అయిన మజ్ను మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో కట్టిపడేసింది. ఆ తర్వాత ఈమె కిట్టు ఉన్నాడు జాగ్రత్త, ఆక్సిజన్, అజ్ఞాతవాసి, నా పేరు సూర్య నా ఇల్లు వంటి చిత్రాల్లో నటించింది. శైలజ రెడ్డి అల్లుడు సినిమాతో మరింత ఫేమస్ అయ్యింది. ఆమె నటించిన సినిమాలు బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. మొదటి సినిమా మాత్రమే సక్సెస్ కాగా.. ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలు అంతగా ఆకట్టుకోలేకపోయాయి. చాలా కాలం తర్వాత ఇటీవల రష్మిక నటించిన ది గర్ల్ ఫ్రెండ్ మూవీలో హీరోయిన్ స్నేహితురాలిగా కనిపించింది. ఆ తర్వాత మరో సినిమా చేయలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ నిత్యం క్రేజీ ఫొటోస్ షేర్ చేస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**